
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY





## చంద్రబాబును కలిసిన పార్థసారథి

టీడీపీ అధినేత, కాబోయే సీఎం నారా చంద్రబాబు నాయుడును ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి గురువారం తాడేపల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబును ఎమ్మెల్యే సత్కరించి ఎన్నికల సరళి గురించి వివరించారు. ఆదోని అభివృద్ధికి సహకరించాలని పార్థసారథి చంద్రబాబును కోరారు. - ఆదోని



**ఎన్‌డీఏ కూటమి ఈ ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాన్ని సొంతం చేసుకుంది. ఐదేళ్లు జగన్ సాగించిన అరాచకాలకు 'ఓటు' అనే ఇటుక మీద ఇటుక పేర్చి ప్రజలు సమాధి కట్టారు. వై నాట్ 175.. అంటూ ప్రగల్బాలు పలికిన జగన్ అహంకారానికి ప్రజలు బుద్ధి చెప్పారు. 11 స్థానాలు మాత్రమే ఇచ్చి ప్రతిపక్ష హోదా కూడా లేకుండా లాగేశారు. యావత్ ఆంధ్రావని అభివృద్ధి సారథి చంద్రబాబు కావాలని ముక్తకంఠంతో నినదించింది. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి 164 సీట్లు ఇచ్చి చారిత్రక విజయాన్ని అందించారు. ఈ విజయానికి 2022లో కర్నూలులోనే బీజం పడింది. ప్రశ్నిస్తే కేసులు పెడతారనే భయంతో వైసీపీ ప్రభుత్వం, ఆ పార్టీ నాయకులు ఎన్ని అరాచకాలు, విధ్వంసం సృష్టించినా టీడీపీ కార్యకర్తలు మౌనంగా భరించారు. దీంతో ప్రజలంతా తమ వైపే ఉన్నారనే భ్రమలోకి వైసీపీ నాయకులు వెళ్లిపోయారు. టీడీపీ శ్రేణులు నిస్తేజంలో ఉండిపోయారు. అలాంటి సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు 2022 నవంబరు 16,17,18 తేదిల్లో కర్నూలులో నిర్వహించిన బాదుడే బాదుడు సభలకు లక్షల జనం పోటెత్తారు. ఈ సభలు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఆ తరువాత యువనేత నారా లోకేశ్ యువగళం పేరిట సాగించిన పాదయాత్రలో జన పోటెత్తారు. ఆనాడు అలా మొదలైన జన ఉప్పెన.. నంద్యాలలో చంద్రబాబు అరెస్టుతో మరింత ఉధృతమై ఓట్ల సునామీ సృష్టించింది. చంద్రన్నకు జేజేలు పలికిన ప్రజలు ఆంధ్రావనిలో కనీవినీ ఎరగని సీట్లు ఇచ్చారు. ఈనాటి విజయం వెనుక ఆనాడు జిల్లా టీడీపీ శ్రేణుల పడిన కష్టాలు ఎన్నో..!** -కర్నూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి)



# కర్నూలుతోనే ఆరంభం!



నంద్యాలలో చంద్రబాబునాయుడిని అరెస్టు చేస్తున్న దృశ్యం (ఫైల్)

రాష్ట్రంలోనే కాదు.. జిల్లాలో కూడా టీడీపీ కూటమి చారిత్రక విజయం సొంతం చేసుకుంది. స్వాతంత్ర్యం తరువాత 30 ఏళ్లకుపైగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను కాంగ్రెస్ పాలించింది. ఏకచత్రాధిపత్య పాలన సాగించింది. జనంలో తీవ్ర వ్యతిరేకత ఉన్నా అండగా నిలిచే పార్టీ ప్రజలకు కనిపించని పరిస్థితి. ఆ సమయంలో అన్న ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీ స్థాపించారు. పల్లెల్లో పట్నాల్లో రాజకీయ చైతన్యం తెచ్చారు. ఎమ్మెల్యే ముఖమే చూడని గ్రామాలకు ఎమ్మెల్యే అభ్యర్థులను పరుగులు పెట్టించారు. ఎన్టీఆర్ ప్రభంజనం కొనసాగుతున్న 1983లో జరిగిన ఎన్నికల్లో కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలో కేవలం ఆరు సీట్లతో సరిపుచ్చుకోవాల్సి వచ్చింది. ఈ తర్వాత 1999లో ఒక్కటే 10 సీట్లు టీడీపీ దక్కించుకుంది. ఏ ఎన్నికల్లో కూడా సింగిల్ డిజిట్ దాటలేదు. 25 ఏళ్ల తరువాత కర్నూలు ఉమ్మడి జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలలో పాటు 12 అసెంబ్లీ స్థానాల్లో ఏకపక్ష గెలుపు అందుకోవడం టీడీపీ కూటమికి చారిత్రక విజయం. ఈ విజయానికి కర్నూలులోనే బీజం పడిందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయ పడుతున్నారు.



### నిస్తేజం నుంచి ఉత్తేజం

2019 మే 30న సీఎం జగన్ బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే రెండేళ్లు కరోనా. ఆ సమయంలో కూడా జగన్ ప్రభుత్వం మానవత్వం చూపకుండా అరాచకాలకే పెద్దపీట వేసిందనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం విధానాలను ప్రశ్నిస్తే సీఐడీ పోలీసులు ఇంటికొచ్చి కేసులు పెట్టే పరిస్థితి. టీడీపీ శ్రేణులు కూడా కేసులకు భయపడి చూద్దాం.. సమయం ఉంది కదా అని జగన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రోడ్లపైకి రాలేని పరిస్థితి. ఓ రకంగా చెప్పాలంటే టీడీపీ శ్రేణులు నిస్తేజంలో మునిగిపోయాయి. ఒకరిద్దరు నాయకులు మినహా వైసీపీ ప్రభుత్వ అకృత్యాలను ప్రశ్నించలేని పరిస్థితుల్లో ఉన్నారు. అలాంటి సమయంలో టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు 2022 నవంబరు 16,17,18 తేదిల్లో జిల్లాలో పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరులో బాదుడే.. బాదుడు రోడ్‌షో, సభలు నిర్వహించారు. పాణ్యం, కోడుమూరు, ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో 11 మండలాలు, 32 గ్రామాలు, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆదోని పట్టణాల్లో ఆనాడు చంద్రబాబు పర్యటన సాగింది. నిస్తేజం నుంచి జ్వలించిన ఉత్తేజమై బాబు రోడ్‌షో, సభలకు జనం వెల్లువెత్తారు. ఎమ్మిగనూరు, ఆదోని, పత్తికొండ సభల్లో జన సునామీ సృష్టించారు. ఈ ఉత్తేజం రాష్ట్ర టీడీపీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహం, జోష్ పెంచింది. వైసీపీ నాయకుల్లో ఇదేంటి..? ఇంతలా జనం ఎలా వచ్చారు..? అంటూ విస్మయాన్ని కలిగించింది. తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో రంగంలోకి దిగిన నిఘా (ఇంటలిజెన్సీ) వర్గాలు బాబు పర్యటనలో 4-5 లక్షల మంది మమేకమై ఉంటారని అంచనా వేశారు. టీడీపీ రాష్ట్ర పార్టీ సమావేశంలో ఈ సభలు దిగ్విజయం చేసిన కె. మీనాక్షినాయుడు, బీవీ. జయనాగేశ్వరరెడ్డి, కేఈ శ్యాంబాబులను ప్రత్యేకంగా అభినందించారు.



### ● నంద్యాలలో చంద్రబాబు అరెస్టుతో..

ఉమ్మడి జిల్లాలో అధినేత చంద్రబాబు, యువనేత లోకేశ్ పర్యటనలను సూపర్ సక్సెస్ చేసిన ప్రజలు.. చంద్రబాబు అరెస్టుతో ఆగ్రహించారు. స్కామ్ లేని 'ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌'లో రూ.371 కోట్లు అవినీతి చేశారంటూ ఏ ఆధారం, నోటీస్ లేకుండానే నంద్యాల పర్యటనలో ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబును 2023 సెప్టెంబరు 9న జగన్ ప్రభుత్వం అరెస్టు చేసి 52 రోజులు జైల్లో పెట్టారు. బాబు అరెస్టును తట్టుకోలేక వందలాది అభిమానుల గుండెలు ఆగాయి. టీడీపీ శ్రేణులే కాదు.. సామాన్య ప్రజలు కూడా జగన్ ప్రభుత్వం తీరుపై ఆగ్రహంతో ఊగిపోయారు. నంద్యాల సహా 12 అసెంబ్లీ స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాల్లో పసుపు జెండా ఎగరవేసి చారిత్రాత్మక విజయాన్ని టీడీపీకి అందించారు.

### ● యువనేత లోకేశ్ పాదయాత్రతో జోష్

చంద్రబాబు పర్యటనలు సూపర్ సక్సెస్‌తో ఉత్తేజంలో ఉన్న టీడీపీ శ్రేణులకు యువనేత నారా లోకేశ్ యువగళం పేరిట సాగించిన పాదయాత్ర మరింత జోష్ పెంచింది. లోకేశ్ పల్లె మూలాల్లోకి వెళ్లి ప్రజల్లో మమేకం కావడమే కాకుండా జగన్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, స్థానిక ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలపై గర్జించారు. అప్పటి వరకు వైసీపీ అరాచకాలతో భయంతో ఉన్న ప్రజలు, సామాన్యులు ప్రశ్నించేలా చేసింది. 2023 జనవరి 27న కుప్పంలో ప్రారంభించిన పాదయాత్ర ఏప్రిల్ 12న అనంతపురం జిల్లా నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా డోన్ మండలం డి. రంగాపురం వద్ద కర్నూల్లో లోకేశ్ అడుగు పెట్టారు. ఉమ్మడి జిల్లాలో 42 రోజులు, 14 నియోజక వర్గాల్లో సుమారు 425 కి.మీ నడిచారు. సీమ అభివృద్ధి లక్ష్యంగా 'మిషన్ రాయలసీమ'కు రూపకల్పన చేశారు. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల అవినీతి అక్రమాలపై గళమెత్తారు. లోకేశ్ సాగించిన యువగళం పాదయాత్ర టీడీపీ శ్రేణుల్లో ఉత్తేజం నింపితే.. ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచింది. ఆ ప్రశ్నలు ఓట్లుగా మారి మే 13న ఈవీఎం యంత్రాల బటన్ నొక్కి ఊహించని విజయం అందించారు.



## మన వాటా


# 27.585 టీఎంసీలు

- ఎల్లెల్సీకి 19.472 టీఎంసీలు
- 8.113 టీఎంసీలు కేసీ కోటా
- తుంగభద్ర డ్యాంలో 172 టీఎంసీల నీటి లభ్యత
- టీబీపీ బోర్డ వాటర్ రివ్యూ కమిటీ సమావేశం



కర్ణాటకలోని హోస్పేటలో ఉన్న టీబీపీ బోర్డు కార్యాలయంలో మూడు రాష్ట్రాల ఎస్‌ఈల సమావేశం

**కర్నూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి):** తుంగభద్ర జలాశయంలో 2024-25 నీటి సంవత్సరంలో 172 టీఎంసీలు నీటి లభ్యత ఉంటుందని, కేడబ్ల్యూడీటీ దామాషా ప్రకారం కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నీటి వాటాగా 27.585 టీఎంసీలు కేటాయించారు. గురువారం తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశం కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌లోని టీబీపీ బోర్డు కార్యాలయంలో జరిగింది. బోర్డు ఎస్‌ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్‌ఈ రెడ్డిశేఖర్ రెడ్డి సహా అనంతపురం ఎస్‌ఈ రాజశేఖర్, కర్ణాటక ఎల్‌బీఎంసీ ఎస్‌ఈ బసవరాజ్‌నాయక్ తదితరులు హాజరు అయ్యారు. గత పదేళ్లగా తుంగభద్రకు వచ్చిన వరద, డ్యాంలో చేరిన వరద, నీటి వినియోగం లెక్కల ఆధారంగా ఈ నీటి సంవత్సరంలో 1723 టీఎంసీలు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ) దామాషా ప్రకారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వాటాను నిర్ణయించారు. ముందస్తు రుతుపవనాలు రావడంతో డ్యాంలో ఆశాజనంగా వరద చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఏపీ వాటాగా 53.953 టీఎంసీలను కేటాయించారు. ఎల్లెల్సీ వాటా 24 టీఎంసీలకు గాను 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్ వాటా 10 టీఎంసీలకు గాను 8.113 టీఎంసీలు, అనంతపురం జిల్లా హెచ్చెల్సీ వాటా 35.5 టీఎంసీలకు గాను 26.368 టీఎంసీలు ఇవ్వవచ్చని అంచనా వేశారు. అలాగే తెలంగాణ వాటా కింద 5.282 టీఎంసీల నీటిని ఆర్‌డీఎస్ కాలువ ద్వారా అందించాలని నిర్ణయించారు. కర్ణాటకకు 112.765 టీఎంసీల నీటిని కేటాయించారు. తుంగభద్ర జలాశయం పూడిక చేరడంతో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. వాస్తవంగా 115 టీఎంసీలకుగా నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలకు తగ్గించారు. 205 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంటే బచావత్ అవార్డు దామాషా ప్రకారం ఆయా కాల్వలకు నీటి వాటాలను వంద శాతం కేటాయిస్తారు. డ్యాంలో కనిష్ఠంగా 40 టీఎంసీలు చేరితే ఈ ఏడాది జూలై 20 తరవాత కర్నూలు, అనంతపురం జిల్లాల ఇంజనీర్లు ఇచ్చే ఇండెంట్ మేరకు ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాల్వలకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది.





ఆనంద్ టాకీస్ వద్ద హంద్రీనీవా ప్రవాహం

# భయపెట్టిన ఉరుములు..మెరుపులు

● ఆందోళనకు గురైన పిల్లలు, వృద్ధులు ● అర్ధరాత్రి నుంచి భారీ వర్షం



**కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 6:** నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పిడుగుపాటుకు జిల్లాలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఇకపై వర్షాల ఉధృతంగా కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. జూన్ నెలలో సాధారణ వర్షపాతం 77.2 ఎంఎం కురవాల్సి ఉండగా.. గురువారం నాటికి 40 ఎంఎం వర్షపాతం నమోదైంది. గత సంవత్సరం ఇదే సమయానికి కనీసం సాధారణ వర్షపాతం పది శాతం కూడా నమోదు కాలేదు. వర్షాల జోరు పెరుగుతుండటంతో రైతులు సంతోషిస్తూ విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సంవత్సరం ఖరీఫ్ సాగు విస్తీర్ణం రెండు జిల్లాల్లో కలిపి 6.30 హెక్టార్ల విస్తీర్ణానికి మించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు.

● **హంద్రీకి జలకళ..** పొంగిన వాగులు, వంకలు: ఉమ్మడి జిల్లాలో ప్రధాన జలాశయాలైన శ్రీశైలం, తుంగభద్ర డ్యాములలో నీటి నిల్వ డెడ్ స్టోరేజీకి చేరుకున్న సమయంలో ముందస్తు వర్షాలు ఆరంభమయ్యాయి. గత కొన్నేళ్లగా కర్నూలు నగరం గుండా ప్రవహిస్తున్న హంద్రీనదికి నీటి జాడ లేకపోవడంతో ముళ్లకంపలు మొలిచాయి. జూన్ ప్రారంభంలోనే గత నాలుగైదు రోజులుగా ఈ నది ఎగువ భాగంలో కురుస్తున్న వర్షాలకు కొంత మేర వరద నీరు చేరి కర్నూలు నగరంలోని నదిలోకి ప్రవేశించింది. దీంతో నగర ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా కర్నూలు రూరల్ మండలం భూపాల్‌నగర్ పరిధిలోని లక్ష్మీనగర్‌లో లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. ఆ ప్రాంతాలను కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి వెళ్లి పరిశీలించారు.

లోతట్టు ప్రాంతాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి





ఓర్వకల్లు ఉధృతంగా తుంగభద్ర కాలవ



గార్గేయపురం చెరువు వద్ద చెక్‌డ్యాంపై పోటెత్తిన వరద



గార్గేయపురం చెరువు వద్ద వరద ప్రవాహం

# అందరికీ ధన్యవాదాలు

కలెక్టర్ డాక్టర్ జి.సృజన



**కర్నూలు(కలెక్టరేట్), జూన్ 6:** సాధారణ ఎన్నికలు-2024 ప్రక్రియకు సహకరించిన అందరికీ కలెక్టర్ డా.జి. సృజన ధన్యవాదాలు తెలియజేశారు. కౌంటింగ్ పూర్తయిన తర్వాత కేంద్రం నుంచి తెచ్చిన ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో గురువారం కలెక్టర్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి సీల్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సాధారణ ఎన్నికల పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా ముగిసిందన్నారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల నిర్వహణకు సహకరించిన జిల్లా ప్రజలు, ఓటర్లు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసు యంత్రాంగం, రిటర్నింగ్ అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, కేంద్ర బలగాలు, అన్ని రకాల నిఘా స్క్వాడ్ సెక్టోరియల్ అధికారులు, పోలీసులు, కౌంటింగ్ సిబ్బంది, జిల్లా స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు ఎన్నికల నిర్వహణలో పాల్గొన్న ఇతర అధికారులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, అభ్యర్థులందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు.

## అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

● కడసారి భార్య, బిడ్డలను చూసి బలవన్మరణం


వడ్డె బజారి (ఫైల్)

**ఎమ్మిగనూరు, జూన్ 6:** పంటల దిగుబడులు లేక సాగుకోసం చేసిన అప్పులు తీర్చే దారిలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం ఎమ్మిగనూరు మండలం బోడబండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డె బజారి(39)కి ఏడు ఎకరాల పొలం ఉంది. దీనికి తోడు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని కొంతకాలంగా వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నాడు. తన సొంత పొలంలో అప్పులు చేసి రెండు బోర్లు వేయించి మిరప పంట సాగుచేశాడు. అయితే పంటల దిగుబడి ఆశించిన మేర రాకపోవడంతో పూర్తిగా నష్టపోయాడు. అప్పులు పెరిగి దాదాపు రూ. 10 లక్షలకు చేరాయి. ఈ క్రమంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో దీంతో ఆత్మహత్య శరణ్యమని భావించాడు. బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం భార్య, పిల్లలను కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడు (భార్య పుట్టినిల్లు)కు పంపాడు. రెండు రోజుల క్రితం రైతు బజారి కురుగోడుకు వెళ్లి భార్య, పిల్లలను కడసారి చూసి.. అదే గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు హుటా హుటిన బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బజారి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని రైతు బజారి స్వగ్రామం బోడబండకు తీసుకొచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. రైతు బజారికి భార్య సరస్వతి, పిల్లలు రేణుక, అనుపమ, కుమారుడు మహేష్ ఉన్నారు.

## గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

**పాణ్యం, జూన్ 6:** ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల కన్వీనర్ ఫ్లోరమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియంలో 2024- 25 సంవత్సరానికి గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో బాలికలకు నెరవాడ, ఆరెకల్, ఆళ్ళగడ్డ, వెల్దుర్తి బాలురకు బనగానపల్లె, గోరంట్ల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6,7,8,9, తరగతిలో వివిధ క్యాటగిరిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 5 వతేదీ లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20 తేదీన వారి సొంత జిల్లాల కన్వీనర్ ప్రిన్సిపాల్ స్కూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్ష మించరాదన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు నెరవాడ 9866559668, ఆరెకల్ 9705984824, ఆళ్లగడ్డ 7981458148, వెల్దుర్తి 9550645847, బనగానపల్లె 9966345050, గోరంట్ల 9703083764 నెంబర్లతో సంప్రదించాలన్నారు.

## విజేతలకు ఈ పోస్టు ద్వారా శుభాకాంక్షలు

**కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి**

**కర్నూలు(న్యూసిటీ), జూన్ 6:** 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలైనవారికి ఈ పోస్టు ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విజయం సాధించిన ప్రజాప్రతినిధికి ఈ పోస్టు సందేశాల ద్వారా వారి విజయానికి హృదయపూర్వక అభినందనలు, వారి రాబోయే పదవీకాలానికి శుభాకాంక్షలు తెలియజేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు, అభిమానులు కేవలం రూ.12 చెల్లించి దగ్గరలోని ఏదైనా పోస్టాఫీసులో ఈ పోస్టు ద్వారా తమ ప్రియతమ నేతలకు శుభాకాంక్షలు పంపవచ్చన్నారు. ఈ సందేశాలు నేరుగా ఆ నాయకుల చేతికే చేరుతాయన్నారు.

## గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు


ఈవీఎం గోడౌన్ గదికి సీల్ వేస్తున్న సిబ్బంది

**కర్నూలు(కలెక్టరేట్), జూన్ 6:** ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన సీల్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్‌లోని కింద అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన వీవీ ప్యాట్‌లను, పైన అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచి సీల్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీవో నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

## వ్యక్తి దారుణ హత్య..

**వివాహేతర సంబంధమే కారణమని ఆరోపణ**


మంజుల నాగేంద్ర (ఫైల్)

**కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6:** మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. గ్రామానికి చెందిన వడ్డె మంజుల నాగేంద్ర(35)ను బుధవారం రాత్రి పొద్దుపోయాక అదే గ్రామానికి చెందిన మంజుల పెద్దపుల్లయ్య, మంజుల రామాంజి, మంజుల మనోహర్ గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్దకు రావాలని, కలిసి మద్యం తాగుదామంటూ పిలిపించారు. మద్యం తాగాక వారు నాగేంద్రపై దాడిచేసి బండరాళ్లు, సుత్తెలతో మోది హత్య చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపినాథరెడ్డి తెలిపారు. పెద్దపుల్లయ్య, మంజుల రామాంజిలకు తన భార్యతో చనువుగా వుంటున్నారని మందలించినందుకే నాగేంద్రను వాళ్లు హత్య చేశారని వెల్లడించారు. మృతుడి సోదరుడు మంజుల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## మాజీ జడ్పీటీసీ సభ్యుడి అరెస్టు

**కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6:** మండలంలోని పేట్నికోట గ్రామంలో మే 13న పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలో నిందితుడైన వైసీపీ యువనేత, మాజీ జడ్పీటీసీ ఎర్రబోతుల ఉదయ్ భాస్కరరెడ్డిని గురువారం కోవెలకుంట్లలో అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్యాయత్నం కేసులో ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి నిందితుడిగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## డిగ్రీలో ఆరుగురు డీబార్

**కర్నూలు(అర్బన్), జూన్ 6:** రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3వ, 6వ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనరు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని తెలిపారు.

## బెస్టు ఫీల్డు కానిస్టేబుల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సెబ్ కానిస్టేబుల్

**కర్నూలు(అర్బన్), జూన్ 6:** స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం బెస్టు ఫీల్డు స్టాఫ్ అవార్డుకు ఇంటలిజెన్స్ విభాగంలో కనిస్టేబుల్‌గా పనిచేస్తున్న సీ. విజయ్‌కుమార్ ఎంపికయ్యారని సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ తెలిపారు. గురువారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

## మల్లన్న హుండీ ఆదాయం రూ.4,04,21,906 కోట్లు



**శ్రీశైలం, జూన్ 6:** శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.4,04,21,906 నగదు రూపంలో రాబడిగా లభించింది. ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తులు 28 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 33.25 తులాల బంగారు 5.760 కిలోల వెండి లభించింది. అలాగే 1768 యు.ఎస్.ఏ డాలర్లు, 5 కెనడా డాలర్లు, ఒక ఖత్తార్ రియాల్, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 50 యుకే పౌండ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి.

## ప్రభుత్వ మార్పు.. అధికారుల్లో

# వణుకు


ఇరిగేషన్ కార్యాలయం

- లాంగ్ లీవ్‌లో వెళ్లేందుకు ఇరిగేషన్ ఉన్నతాధికారుల ప్రయత్నాలు
- గత వైసీపీ ప్రభుత్వంలో నేతలతో అంటకాగిన అధికారుల్లో భయం
- రూ.1600 కోట్ల దాకా బిల్లులు రాబట్టేందుకు కాంట్రాక్టర్ల విశ్వ ప్రయత్నం
- బిల్లులపై ఎంక్వైరీకి ఆదేశిస్తారనే ఆందోళన

**కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 6:** తెలుగుదేశం పార్టీ త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైతే.. తమపై ఎంక్వైరీలు జరుగుతాయనే భయం వారిలో మొదలైంది. ఏదో ఒక విధంగా ఈ గండం నుంచి తప్పించుకునేందు కోసం వారు ఇప్పటి నుంచే దారులు వెతుకుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కీలకమైన నీటి పారుదల శాఖలో కొంత మంది ఉన్నతాధికారులు ఈ గండం నుంచి గట్టెక్కేందుకు దారులు వెతుక్కుంటున్నారు. కర్నూలు జిల్లాలో జలమండలి విభాగంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు లాంగ్ లీవ్‌పై వెళ్లాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విభాగంలోని రాష్ట్ర అధికారుల అనుమతి పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖలో పని చేస్తున్న కొంత మంది జిల్లా ఉన్నతాధికారులు అధికారపార్టీ కీలక నేతలతో అంటకాగి, వారి ఆదేశాల మేరకు పనులు చేయించి, నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించారనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పనులతో పాటు హంద్రీనీవా కాలువ ద్వారా 70 చెరువులకు నీరు అందించే కార్యక్రమంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వినిపించాయి. ఈ బిల్లులు యుద్ధ ప్రాతిపదికన సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించడంపై ప్రస్తుతం అధికారంలోకి రానున్న టీడీపీ పెద్దలకు కొంత మంది ఉప్పందించినట్లు తెలుస్తున్నది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద పెద్ద ఎత్తున చెరువుల్లో పూడికతీత, కాలువల్లో మట్టి తొలగింపు, మరమ్మతుల పనులు తదితర ముఖ్యమైన వాటిని చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వారిని ముప్పతిప్పలు పెట్టింది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పుల్లోళ్ల బాధలు పడలేక కొంత మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నీరు-చెట్టు కార్యక్రమం కింద పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాలని, లేకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బిల్లులు చెల్లించమని కోర్టు నుంచి ఉత్తర్వులు కూడా వచ్చాయి. ఏదో విధంగా ఈ బిల్లులను చెల్లించకుండా జాప్యం చేయాలనే కక్షతో వైసీపీ ప్రభుత్వం అప్పటికే పూర్తయిన పనులను క్షుణ్ణంగా పరిశీలించేందు కోసమని వివిధ ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ అధికారులతో ఎంక్వైరీ కోసం కమిటీలు వాశారు.

**● లాంగ్ లీవ్‌పై వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు:**

కర్నూలు సీఈ కార్యాలయ పరిధిలో పోతిరెడ్డిపాడు విస్తరణతో పాటు అవుకు, గోరుకల్లు కాల్వల విస్తరణ, కుందూ వెడల్పు తదితర ప్రాజెక్టుల పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.1600 కోట్ల దాకా చెల్లించాల్సి ఉందని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అదే విధంగా కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఆర్డీఎస్ పనులు చేసిన వారికి రూ.10 కోట్లు, పత్తికొండ నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ పనులు చేసిన వారికి రూ.26 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, ఏ మాత్రం నాణ్యత పాటించలేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వంలో ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లు బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఈ బిల్లులు చెల్లిస్తే.. అధికారంలోకి రానున్న తెలుగుదేశం పార్టీ నేతల నుంచి ఆగ్రహావేశాలను చవిచూడాల్సి వస్తుందని, అందువల్లనే మధ్యే మార్గంగా విధుల నుంచి తాత్కాలిక విరామం తీసుకునేందుకు దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు కొంత మంది అధికారులు చెబుతున్నారు.

## తీగల వంతెన నిర్మాణానికి కృషి చేస్తాం

- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి
- రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత
- అరాచక శక్తులకు ఓటమి తప్పదు
- టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

**నంద్యాల (నూనెపల్లె), జూన్ 6:** సిద్ధేశ్వరంపై నిర్మించే తీగల వంతెనతో పాటు బ్యారేజీ నిర్మాణానికి కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలోని టీడీపీ ఎంపీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరిని 1,12,000 ఓట్లతో గెలిపించిన అన్ని వర్గాల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. సిద్ధేశ్వరంపై తీగల వంతెనతో పాటు బ్యారేజీని నిర్మిస్తే జిల్లాలోని రైతులకు, ప్రజలకు తాగు, సాగు నీరు పుష్కలంగా లభిస్తుందని అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుపై దృష్టి పెడతామన్నారు. 2019 ఎన్నికలలో నంద్యాల పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో గెలిచిన వైసీపీ నాయకులు ప్రజలకు సేవ చేయకుండా జిల్లాలోని సహజ వనరులను దోచేసి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అరాచక పాలనతో ప్రజలను విసిగించారని దీంతో అరాచక శక్తులను చిత్తుగా ఓడించి ప్రజా సేవకులకు పట్టం కట్టారని అన్నారు. ప్రజలకు, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటామని, వైసీపీ రౌడీ మూకల నుంచి రక్షణగా నిలుస్తామని అన్నారు. ఏదైనా సమస్య వస్తే ప్రజలు నేరుగా వచ్చి విన్నవించుకునేలా అందుబాటులో ఉంటామని ఆయన భరోసా కల్పించారు. భూకబ్జాలకు పాల్పడిన నాయకులపై విచారణ జరిపించి తగు చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు ఎంపీ కార్యాలయానికి చేరుకున్న బైరెడ్డికి టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.

# సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

**నంద్యాల టౌన్, జూన్ 6 :** రాయలసీమ కరువు పరిష్కారానికి, శ్రీశైలం ప్రాజెక్టు జీవితకాలం పెరగడానికి సిద్ధేశ్వర అలుగు నిర్మించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించబోతున్న సిద్ధేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలో రాయలసీమ అభివృద్ధికి ఎన్నో హక్కులు కల్పించినప్పటికీ వాటిని అమలుపరచకుండా ఈ పదేళ్లలో పాలకులు అన్యాయం చేశారని అన్నారు. రాయలసీమకు ద్రోహం జరుగుతున్న నేపథ్యంలో వేలాది మంది రైతులు కదిలి వచ్చి 2016, మే 31న ప్రజా సంఘాల నేతృత్వంలో సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన చేశారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీలు రాయలసీమ అంశాలను తమ తమ మేనిఫెస్టోలో ప్రకటించాయని, కానీ పాలకులు గత పదేళ్లుగా ప్రకటనలతో సరిపెట్టుకున్నారని, రాయలసీమను మోసం చేస్తున్నారని అన్నారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన 8వ వార్షికోత్సవాన్ని ఈ నెల 10న సిద్ధేశ్వరం వద్ద పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, రైతు సంఘాలు, యువత, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు వార్షికోత్సవానికి హాజరై రాయలసీమ ఉజ్వల భవిష్యత్తుకు పాలకులపై ఒత్తిడి పెంచే కార్యక్రమంలో పాల్గొనాలని దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ కేసుల్లో గైనిక్ విభాగం ముందంజ

**- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి**


మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

**కర్నూలు(హాస్పిటల్), జూన్ 6:** ఆరోగ్యశ్రీ కేసులు నమోదులో గైనిక్ విభాగం అందరికంటే ప్రథమ స్థానంలో ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రి ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాల్లో టార్గెట్ ప్రతి నెలా 500 కేసులకు మించి చేయాలని లక్ష్యాన్ని పూర్తి చేసిన వారికి బోనస్ ప్రకటిస్తామన్నారు. మే నెలలో ఆరోగ్యశ్రీ కేసుల్లో గైనిక్ విభాగం 666 కేసులు, జనరల్ మెడిసిన్ 438, సర్జరీ విభాగం 325 కేసులు చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయన్నారు. అలాగే న్యూరాలజీలో 142 ఐసీయూ కేసులు ఆపరేటివ్ చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను బయటకు పంపించకుండా ఆరోగ్యశ్రీ ద్వారా హాస్పిటల్‌లో రిజిస్టర్ అయ్యేలాగా చూడాలన్నారు. ఏ ఒక్క కేసు కూడా బయటకు పంపకూడదని అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇకపై ఆరోగ్యశ్రీలో ప్రతి వారం సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమీక్షలో సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ హేమనళిని, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ శివబాల, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

## ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌గా వెంకటరమణ



**కర్నూలు(హాస్పిటల్), జూన్ 6:** ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణను నియమిస్తూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న వెంకటరమణ ఏఆర్ఎంవోగా, ఎంఎస్‌వోల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ ర్యాంకోగా బాధ్యతలు చూసుకుంటున్నారు. సూపరింటెండెంట్ ఆదేశాలతో కొత్తగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా రోజువారి కేసులు, నివేదికలు వాటి వివరాలను నిర్వహించనున్నారు.

## విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

● బనగానపల్లెలో ఒకరు, బేతంచెర్లలో మరొకరు


పాండురంగ (ఫైల్)


మృతి చెందిన గాజుల ఈశ్వరమ్మ

**బనగానపల్లె, జూన్ 6:** జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బనగానపల్లెలో పాండురంగ అనే వ్యక్తి మృతి చెందగా బేతంచెర్లలో ఈశ్వరమ్మ అనే మహిళ మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన సంగు వెంకటేశ్వర్లు కుమారుడు సంగు పాండురంగ (32) అనే గని కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఉదయం పలుకూరు సమీపంలోని గనిలో విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా పాండురంగ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పాండురంగ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు తెలిపారు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు పిల్లలు సంతానం. పాండురంగ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

**బేతంచెర్ల:** పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న గాజుల ఈశ్వరమ్మ ఇంట్లో కరెంట్ స్విచ్ వేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. గోరుమానుకొండ గ్రామానికి చెందిన సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మప్రచారక్ బాలేశ్వరరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులు బేతంచెర్లలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో పనులు చేసుకుంటూ తడిచేత్తోనే కరెంటు స్విచ్ ఆన్ చేయగానే ఈశ్వరమ్మకు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

## కారు, మోటార్ సైకిల్ ఢీ : యువకుడి మృతి

● ఒకరికి గాయాలు


మృతి చెందిన ముల్లా మెహది హసన్

**బనగానపల్లె రూరల్, జూన్ 6 :** మండల పరిధిలోని యనకండ్ల గ్రామం వద్ద కారు - మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. బనగానపల్లె పట్టణం కొండపేటకు చెందిన ముల్లా మెహదీ హసన్, షేక్ మస్తాన్ బేతంచెర్ల పట్టణంలోని కూల్ డ్రింక్ షాప్‌లో పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం బనగానపల్లె నుంచి బేతంచెర్ల వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చేవారు. బుధవారం రాత్రి బేతంచెర్ల నుంచి బనగానపల్లెకు మోటార్ సైకిల్‌పై ఈ యువకులు వస్తున్నారు. 10:30 గంటల సమయంలో బనగానపల్లె నుంచి పలుకూరు వెళుతున్న కారు యనకండ్ల గ్రామం వద్ద వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముల్లా మెహది హసన్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె పోలీసులు తెలిపారు.

## పద్మ అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

**కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 6:** భారత ప్రభుత్వం 2025 సంవత్సంలో ప్రదానం చేసే పద్మ, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డుల పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు తమ దరఖాస్తులను ఏపీ రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ మెయిల్ అడ్రస్ sportsnap@gmail.com (or) incentives.schemes@ gmail.comకు ఆగస్టు ఒకటోతేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు.

## అరాచక ప్రభుత్వాన్ని తరిమికొట్టారు: గౌరు



భైరాపురం, కొమ్ముచెరువు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రజలకు అభివాదం చేస్తున్న గౌరు వెంకటరెడ్డి

**ఓర్వకల్లు, జూన్ 6:** అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి అన్నారు. గురువారం అమావాస్య సందర్భంగా మండలంలోని భైరాపురం గ్రామ సమీ పాన వెలసిన ఆంజనేయస్వామికి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ యువ నాయకుడు గౌరు జనార్ధన్ రెడ్డి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గౌరు కుటుంబానికి కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గౌరు మాట్లాడుతూ ఎన్డీయే కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారన్నారు. జగన్, వైసీపీ నేతల అహంకారం, సైకో విధానాలను భరించలేక అన్ని వర్గాల ప్రజలు వైసీపీని గెలిపించారన్నారు. గౌరు చరితను భారీ మెజారిటీతో గెలిపించిన ప్రతి ఒక్కరికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పుసులూరు ప్రభాకర్ రెడ్డి, నాయకులు, కార్యక ర్తలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొమ్ముచెరువు, కాల్వ, భైరాపురం గ్రామాల్లో అమావాస్య పర్వదినం కావడంతో భక్తులు స్వామివారికి పూజలు చేశారు.

## కూటమి గెలుపు కార్యకర్తల విజయమే



కాల్వబుగ్గలో టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

**ఓర్వకల్లు, జూన్ 6:** సార్వత్రిక ఎన్నికల్లో కూటమి గెలుపు కార్యకర్తల విజయమేనని మండల తెలుగు యువత అధ్యక్షుడు రాము, కాపు సంఘం నాయకులు కేవీ మధు అన్నారు. గురువారం మండలం లోని కాల్వబుగ్గ దేవస్థానంలో గ్రామ కాపు సంఘం నాయకులు కేవీ మధు ఆధ్వర్యంలో ముందుగా శివునికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం ఎదురుగా 101 టెంకాయలు కొట్టి పూజలు చేశారు. చంద్రబాబు నాయుడు తిరుగులేని నాయకుడిగా నిలిచారని, అలాగే పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల పార్ల మెంటు ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అఖండ మెజారిటీతో గెలుపొందడంతో పూజలు నిర్వహించా మ న్నారు. అయితే.. జిల్లాలో ఎక్కడా లేని మెజారిటీ గౌరు చరితమ్మకు వచ్చిందన్నారు. ఎన్డీయే కూటమి అత్యధిక మెజారిటీతో గెలుపొందడంతో వానదేవుడు కూడా కరుణిం చాడని, ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే మండలంలో భారీ వర్షం కురవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయ కులు బజారు, డీకే శేఖర్, జగదీష్, వేణు, మహేష్, రామగోవిందు, అన్వర్, హరి, విజయకృష్ణ, వడ్డె రాముడు పాల్గొన్నారు.

## 'ఇండియా కూటమికి టీడీపీ మద్దతు ఇవ్వాలి'

**కర్నూలు(అర్బన్), జూన్ 6:** తెలుగుదేశం పార్టీ ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలని కర్నూలు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రాంపుల్ల య్య యాదవ్ కోరారు. గురువారం నగరంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ఓటింగ్ శాతం పెరిగిందని, రాబోయే రోజుల్లో మరింత బలపడుతుందని, 2019లో రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని అన్నారు. కర్నూలు ఎంపీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసిన తనకు రాష్ట్రంలోనే రెండో స్థానంలో 70,373 ఓట్లు వేసి మంచి గుర్తింపు ఇచ్చారని, ఆయన ప్రజలకు కృతజ్ఞాతలు తెలిపారు.. ఇండియా కూటమీ అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా వస్తుందని గుర్తు చేశారు. జిల్లాలో 2015లో చంద్రబాబు శంకుస్థాపన చేసిన వేదవతి, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. స్టాండింగ్ కమిటీ చైర్మన్ నరసింహులు యాదవ్ మాట్లాడారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొత్తూరు సత్యానారా యణ గుప్త, లక్కీటూ లోకనాథ్‌యాదవ్, ప్రదీప్ వెం కటేష్, మాలిక్, ఫైరోజ్ షబ్బీర్ పాల్గొన్నారు.

## తెలుగు మాధ్యమాన్ని పాఠశాలలో ప్రారంభించాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 6:** మొదటి సంతకంతోనే తెలుగు మాధ్య మాన్ని అని పాఠశాలలో ప్రారంభించాలని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు డేగల మహేష్ అన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజలపైనా, విద్యార్థులపైనా బలవంతంగా వ్యతిరేక విధానాలను రుద్దిందన్నారు. పాఠశాలలో ఇంగ్లీషు మీడియం అమలు చేయడంతో పేద విద్యార్థులు చదువులో వెనుకబడ్డారన్నారు. గత ప్రభు త్వం చేసిన తప్పును రాబోవు నూతన ప్రభుత్వం తమ మొదటి సంత కంతో ఈ విధానాన్ని మార్చా లన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజశర్మ, సమితి సభ్యులు పాల్గొన్నారు.

## నీట్‌లో రాణించిన సాత్విక్

**కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 6:** ఇటీవల విడుదలైన నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో కర్నూలుకు చెందిన బాలగారి సాత్విక్ ప్రతిభను కన బరిచారు. స్థానిక కల్లూరు బృందావన్‌నగర్‌లో నివాసముంటున్న దంపతులు బాలగారి సుందర్‌రావు, దండు సునీత ఇద్దరూ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతు న్నారు. వీరి కుమారుడు సాత్విక్ 10వ తరగతి పరీక్షలో 591/600 మార్కులు సాధించాడు. విజయవాడ గోశాల క్యాంపస్ శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్‌లో విద్యనభ్యసించి ఇంటర్ పరీక్షలో 984/1000 మార్కులు సాధించాడు. ఇటీవల విడుదలైన నీట్ పరీక్ష ఫలితాల్లో 690/720 మార్కులు సాధించాడు. ఢిల్లీలో ఏఎంసీలో మెడిసిన్ చదవాలన్నదే లక్ష్యమని సాత్విక్ వివరించారు.

## చలో సిద్ధేశ్వరం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు

**కర్నూలు(కల్చరల్), జూన్ 6:** సిద్దేశ్వరం ప్రజా శంకుస్థాపన 8వ వార్షికోత్సవం ఈ నెల 10న నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సిద్ధేశ్వరం గ్రామంలో జరుగుతుందని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి ప్రకటించారు. గురువారం వేదిక ఆధ్వర్యంలో నగరంలోని పీవోడబ్ల్యూ కార్యాలయంలో పోస్టర్, కరపత్రం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక నాయకులు శేషాద్రి రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శివశంకర్, సీపీఐ నాయకులు రామక్రిష్ణారెడ్డి, లాయర్ డేవిడ్, రాయల సీమ విద్యావంతుల వేదిక నాయకుడు రత్నం ఏసేపు, సుబ్బరా యుడు, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, యువజన నాయ కుడు రవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దశాబ్దా లుగా రాయ లసీమ అన్యాయానికి గురవుతూ వచ్చిందని, కొత్త ప్రభుత్వం రాయలసీ మలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలని, కరువు నివారణ చర్యలు చేపట్టాలని అన్నారు. ఏపీ రాష్ట్ర విభజన చట్టంలో రాయల సీమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల సిద్ధేశ్వరంలో జరగనున్న 8వ వార్షికోత్సవ కార్యక్రమంలో రైతులు, యువ కులు, విద్యార్థులు, రాయలసీమ ప్రజా సంఘాల నాయకులు పాల్గొని జయప్ర దం చేయాలని కోరారు.

# గౌరు చరితకు అభినందనల వెల్లువ

» సర్వమత పెద్దలు, సంఘాల నాయకులు, ఉద్యోగులతో కిక్కిరిసిన గౌరు నివాసం
» గౌరు దంపతులను సన్మానించిన మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్య

**కల్లూరు, జూన్ 6:** పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ప్రత్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డిపై 40,591 ఓట్ల ఆధిక్యతతో గెలిచి జయభేరి మోగించిన గౌరుచరితకు అభినందనల వెల్లువ కొనసాగింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌క ళ్యాణ్, బీజేపీ పక్షాల ఉమ్మడి కూటమి నేతగా అఖండ విజయం అందుకోవడం చాలా ఆనం దాన్ని ఇచ్చిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత స్పష్టం చేశారు. గురువారం గౌరు నివాసంలో హిందూ ప్రధాన అర్చకులు, ముస్లిం, క్రిస్టియన్ మతపెద్దలు విచ్చేసి ఘనవిజయం అందుకున్న గౌరుచరిత క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. అలాగే పలు సంఘాల నాయకులు గౌరు దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు గౌరు నివాసానికి క్యూకట్టి పూల బొకేలు, స్వీట్లు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. నాలు గు మండలాల్లో పనిచేస్తున్న ఆయా శాఖల అధికారులు ఎమ్మెల్యే గౌరు చరితను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కర్నూలు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంఘం నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, గౌరు వెంకటరెడ్డి కలిసి అభినందించారు.

● **గౌరు చరితకు మాండ్ర, గిత్తా జయసూర్య అభినందనలు:** పాణ్యం నియోజకవర్గం ఎమ్మెల్యేగా ఘనవిజయం అందుకున్న గౌరుచరితకు టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ మాండ్ర శివానందరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అభినందనలు తెలిపారు. గురువారం మాధవీనగర్‌లోని గౌరు నివాసానికి చేరుకుని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జ్ గౌరు వెంకటరెడ్డిని పూలబొకేలు అందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు.

● **టీడీపీ శ్రేణుల సంబరాలు:** పాణ్యం నియోజకవర్గ ఎమ్మెల్యేగా అఖండ మెజారిటీతో విజయదుందుభి మోగించిన గౌరుచరిత నివాసంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సంబరాలు జరుపుకున్నారు. గురువారం కల్లూరు రూరల్, అర్బన్, ఓర్వకల్లు, గడివేముల, పాణ్యం మండ లాల నుంచి వేల సంఖ్యలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు, మహి ళలు పెద్దఎత్తున గౌరు నివాసానికి చేరుకుని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు శాలువాలు, పూలదండలు వేసి సన్మానించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో పాణ్యం నియోజకవర్గం తరపున 40591 ఓట్లతో భారీ మోజార్టీ సాధించిన గౌరు చరితమ్మతో టీడీపీ నాయకులు, మహిళలు కేక్‌కట్ చేయించి సంబ రాలు జరుపుకున్నారు.

**గౌరు చరిత, కేఈ శ్యాంబాబులకు వేద ఆశీర్వాదాలు**

**కర్నూలు(కల్చరల్):** నూతనంగా తెలుగుదేశం పార్టీ తరపున అసెంబ్లీకి ఎన్నికైన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబులను బ్రాహ్మణ వేద పండితులు కలిసి వేద ఆశీస్సులు అంద జేశారు. గురువారం నగరంలోని గౌరు చరిత, కేఈ శ్యాంబాబుల నివా సాల్లో కలిసిన జిల్లా టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యులు, బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి నాయకులు వారికి అభినందనలు తెలి యజేశారు. భవిష్యత్తులో మంచి పదవులతో అధికారంలో రాణించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వ వచనాలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా బ్రాహ్మణ సాధికార కమిటీ నాయకులు సందేల్ చంద్రశేఖర్, కంచు గంటల శ్యాం సుందర్‌రావు, సీఎస్ ప్రసాదరావు, టీవీ రవిచంద్ర శర్మ, ప్రదీప్ కుమార్ శర్మ, కరణం హరి శర్మ, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.




గౌరు చరితను సన్మానిస్తున్న ఓర్వకల్లు టీడీపీ నాయకులు, గౌరు చరితను సత్కరిస్తున్న టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ నాయకులు



కేక్ కట్ చేస్తున్న గౌరు చరిత



గౌరు దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మాండ్ర శివానందరెడ్డి, ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



గౌరు జనార్ధన్‌రెడ్డికి పూలబొకే అందిస్తున్న నాయకులు

## అభ్యాసన సామర్థ్యాలు పెంచుకోవాలి: డీఈవో



మాట్లాడుతున్న డీఈవో శామ్యూల్

**కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 6:** పాఠశాల స్థాయి నుంచే అభ్యాసన సామర్థ్యాలు పెంచుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ సూచించారు. గురువారం స్థానిక ఎస్‌ఏపీ క్యాంపులోనీ సీఆర్‌ఆ ర్ఎం పాఠశాలలో జిల్లాలోని అన్ని మండలాల నుంచి 1, 2 తరగతులు బోధించే సెకండరీ గ్రేడ్ స్థాయి ఉపాధ్యాయులు మండలానికి ముగ్గురు చొప్పున పీఆర్పీల శిక్షణ కార్యక్రమం జరిగింది. డీఈవో మాట్లాడుతూ విద్యార్థిలో దాగి వున్న సృజనా త్మకతను వెలికి తీయాలన్నారు. డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ వసుందరా దేవి, సమగ్ర శిక్ష సహాయ పరిశీలన అధికారి షేక్ రఫీ, జిల్లా కోఆర్డినేటర్ దావీదు, సెకండరీ గ్రేడ్ టీచర్లు పాల్గొన్నారు.

### పాఠ్యపుస్తకాల పరిశీలన

**ఓర్వకల్లు, జూన్ 6:** మండలంలోని మోడల్ స్కూల్ పాయింట్‌లో ఉన్న ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను గురువారం సమగ్ర శిక్ష అడిషినల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ విజయజ్యోతి కుమారి, ఎంపీడీవో మల్లీశ్వరి, సీఎంవో అల్లాబకాష్‌లు పరిశీలించారు. ఎంఈవో ఓంకార్ యాదవ్ ఉన్నారు.

### క్రీడాకారులు మెలుకువలు నేర్చుకోవాలి

**కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 6:** క్రీడాకారులను మెలుకువలు నేర్చుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు పాల్గొనే విధంగా శిక్షణ ఇవ్వాలని విజి లెన్స్ సీఐ సునీల్ కుమార్ అన్నారు. గురువారం స్థానిక డీఎస్‌ఏ అవు ట్‌డోర్ స్టేడియంలోని సమ్మర్ కోచింగ్ క్యాంపును గురువారం సందర్శిం చారు.

# ఎమ్మెల్యే టీజీకి అభినందనలు



టీజీ భరత్‌ను అభినందిస్తున్న ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు

**కర్నూలు(అర్బన్), జూన్ 6:** కర్నూలు ఎమ్మెల్యే టీజీ భరత్‌ను ఏపీ ఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వెంగళరెడ్డి కలిసి అభినం దనలు తెలిపారు. గురువారం మౌర్యఇన్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమానికి ఎమ్మెల్యే అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ జవహర్‌లాల్, మాజీ జిల్లా అధ్యక్షుడు క్రిష్టపర్ దేవకుమార్, సీటీ ప్రెసిడెంట్ కాశన్న, క్లాస్ ఫోర్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**బీసీలకు అండగా ఉండాలి:** బీసీలకు అండగా ఉండాలని ఎమ్మెల్యే టీజీ భరత్‌ను టీడీపీ బీసీ సెల్ జిల్లా ఇన్‌చార్జి సత్రం రామకృష్ణుడు డిమాండ్ చేశారు. గురువారం మౌర్యఇన్‌లోని పరిణయా హాలులో టీజీ భరత్‌ను కలిసి సన్మానించారు. జిల్లాలో బీసీలు టీడీపీకి అండగా ఉండి గెలుపు కోసం కృషి చేశారన్నారు. కార్యక్రమంలో బీసీ రాష్ట్ర కార్యవర్గం నాయకులు కాసాని మహే ష్ గౌడ్, కార్పొరేటర్ కురువ పరమేష్, వెంకరాముడు, చంద్రశేఖర్, టీజీ శీను, హరినాథ్‌గౌడ్, విజయలక్ష్మి, అయ్యాత్ బీ, నరసింహనాయుడు పాల్గొన్నారు.



టీజీ భరత్‌ను అభినందిస్తున్న బీసీ నాయకులు

# నీటి ముంపునకు గురైన లక్ష్మీనగర్

**బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే దస్తగిరి**

**కర్నూలు(రూరల్), జూన్ 6:** కర్నూలు రూరల్ మండలం భూపాల్‌నగర్ పరిధిలో ఉన్న లక్ష్మీనగర్ నీటి ముంపునకు గురైంది. బుధవారం జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో గార్గేయపురం చెరువు నిండిపోయి దిగువ ఉన్న లక్ష్మీనగర్ కాలనీలోకి నీరు చేరుకున్నాయి. తద్వారా ఇళ్లల్లోకి నీరు రావ డంతో స్థానికులకు రాత్రంతా కంటిపై కునుకు లేకుండా పోయింది. ఓవైపు విద్యుత్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న కోడు మూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, తహసీల్దార్ రామాంజులనాయక్, ఎంపీ డీవో నరసింహనాయుడుతో కలిసి గురువారం ఉదయం నీటిముంపునకు గురైన కాలనీలో పర్యటించారు. వర్షపు నీళ్ల దిగువ ప్రాంతం వైపు వచ్చిన కారణాలను బాధితులను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ఇళ్లలోకి నీళ్ల చేరడంతో ధాన్యపు గింజలు తడిసిముద్దయ్యాయని కాలనీ వాసులు వారికి వివరించారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని అండగా ఉంటానని కోడు మూరు ఎమ్మెల్యే నీటి ముంపు బాధితులకు భరోసా నిచ్చారు. జరిగిన నష్టాన్ని త్వరలోనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి అన్ని విధాలుగా ఆదుకుంటామని దస్త గిరి కాలనీ వాసులకు హామీనిచ్చారు. వీరివెంట వీఆర్వో మద్దిలేటి, ఈవోఆర్డీ రామచంద్రారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.

**ఓర్వకల్లులో భారీ వర్షం**

**ఓర్వకల్లు:** మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. ఓర్వకల్లులో తుంగభద్ర వాగు పొంగి పొర్లుతుంది. గత ఆరేళ్లుగా కాల్వబుగ్గలో చుక్క నీరు లేక ఎండిపోయిన కోనేర్లు వర్షం రాకతో నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని ప్రతి గ్రామంలో చెరువలు, కుం టలు, బావులు, వాగులు నీటితో పొంగిపొర్లుతున్నాయి. దీంతో రైతులు సం తోషం వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో విత్తనాలు విత్తేందుకు సిద్ధమయ్యారు.

**భారీ వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టు**

**గూడూరు:** మండలంలోని ఆర్ ఖానాపురం గ్రామంలో గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి కల్వర్టు కొట్టుకుపో యింది. ఈవిషయం తెలుసుకున్న ఆర్ ఖానాపురం సర్పంచ్ మునిస్వామి, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్ బాబు, టీడీపీ నాయకులు మన్యంకొండ, కృష్ణ అక్కడికి వెళ్లి పరిశీలించారు. ఈ విషయాన్ని జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి దృష్టికి తీసుకెళ్ళనున్నట్లు వారు తెలిపారు.



లక్ష్మీనగర్ ఇళ్లల్లోకి చేరిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి



వర్షానికి కొట్టుకుపోయిన కల్వర్టును పరిశీలిస్తున్న సర్పంచ్




గార్గేయపురంలో చెరువులో చేపలు పడుతున్న ప్రజలు, చెరువులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద నీరు

## కల్లూరులో గౌరు చరితకు తిరుగులేని మెజార్టీ

**కల్లూరు, జూన్ 6:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీకి పాణ్యం నియోజకవర్గంలో కంచుకోట అయిన కల్లూరు మండలంలోని అన్ని గ్రామాల్లో తిరుగులేని మెజార్టీ వచ్చింది. వైసీపీ ప్రభుత్వ వ్యతిరేకతకు తోడు గౌరు చరితపై ప్రజలకున్న అభిమానం, చంద్రబాబు ప్రతిష్టతో కల్లూరు మండలంలో 4808 మెజార్టీ టీడీపీ కైవశం చేసుకుంది. కల్లూరు మండలంలో మొత్తం 39,020 ఓట్లు ఉండగా 34,226 ఓట్లు 14.05 శాతం పోల్ అయ్యాయి. అందులో వైసీపీ అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డికి 14,140 ఓట్లు రాగా, టీడీపీ కూటమి అభ్యర్థి గౌరు చరితకు 18,948 ఓట్లు పోలై 4,808 మెజార్టీ దక్కించుకుంది. ఒకప్పటి టీడీపీ కంచుకోట కల్లూరు

**మండలంలో 4,808 ఓట్ల ఆధిక్యం**

మండలంలో గౌరు చరిత ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ తిరిగి పూర్వ వైభవం సాధించింది. గ్రామాల వారిగా పర్ల-882, నెరవాడ-83, సల్కా పురం-344, కే.మార్కాపురం-32, పెద్దకొట్టాల-79, బస్తిపాడు-292, రేమ డూరు-180, నాయకల్లు-78, ఉలిందకొండ-1333, చిన్నటేకూరు-515, యాపర్లపాడు-133, తడకనపల్లె-425, పెద్దటేకూరు-240, బొల్లవరం-118, దూపాడు-162, దొడ్డిపాడు-30 ఓట్లతో తిరుగులేని మెజార్టీతో గౌరు చరిత మొత్తం 40,591 ఓట్లతో విజయం సాధించారు.



దస్తగిరిని సన్మానిస్తున్న గూడూరు టీడీపీ నాయకులు

## కోడుమూరులో 40ఏళ్ల చరిత్రను తిరగరాసిన టీడీపీ



విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**గూడూరు, జూన్ 6:** కోడుమూరు నియోజక వర్గంలో జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి సారథ్యంలో బొగ్గుల దస్తగిరి ఎమ్మెల్యేగా గెలిచి నలభై ఏళ్ల చరిత్రను టీడీపీ తిరగరాసిందని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు అన్నారు. గురువారం టీడీపీ నాయకుడు కురు కుంద రామాంజనేయులు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు భారీ ఎత్తున కర్నూలుకు తరలివెళ్లారు. జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డిని ఆయన నివాసంలో కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే కోడుమూరు ఎమ్మెల్యేగా గెలిచిన బొగ్గుల దస్తగిరిని కలిసి శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కురుకుంద రామాం జనేయులు మాట్లాడుతూ కోడుమూరు నియోజక వర్గంలో టీడీపీకి పూర్వ వైభవం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దానమన్న, గజేంద్ర, పౌలు, తెలుగు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ప్రజల ఆకాంక్షల కోసం కూటమి పని చేస్తోంది

**కర్నూలు(అర్బన్), జూన్ 6:** టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల కోసం పని చేస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్లలో జగన్ సాగించిన, అరాచకాలు, అక్రమాలతో విసిగి కూటమికి భారీ మెజార్టీతో పట్టం కట్టార న్నారు. విధ్వంస పాలన, దోపిడీకి, ప్రతిపక్షాల నాయకులు, టీడీపీ క్యాడర్, ప్రజలు, బీసీలపై చేసిన దాడులు, అక్రమ కేసులు, ఆస్తులకు రక్షణ లేకుండా పోవడం, విపరీతంగా పన్ను ల భారం మోప డం, రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పడకేయడంతో ప్రజలు విసి గిపోయా రన్నారు. ఓటు రూపంలో ప్రజావ్యతిరేక ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారన్నారు.

## ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**కర్నూలు(ఎడ్యుకేషన్), జూన్ 6:** జిల్లా వ్యాప్తంగా వాణిజ్య సముదాయ భవనాలలో నిర్వహిస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమన్న, ఏఐఎస్‌ఏ రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టికి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అక్రమంగా వివిధ కోర్సుల పేరుతో రూ.లక్షలకు పైగా వసూలు చేస్తూ అక్రమ అడ్మిషన్లు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు నాగా ర్జున, పీడీఎస్‌యు జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, నగర అధ్యక్షుడు దామోదర్, అజయ్ కుమార్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్యాంబాబుకు నాయకుల సన్మానం



కేఈ శ్యాంబాబును సన్మానిస్తున్న మహిళా నాయకులు

**మద్దికెర, జూన్ 6:** పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్ గౌడు, తాలుకా తెలుగు మహిళా అధ్యక్షురాలు జానకీ చౌదరి గురువారం పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల రాక్షస పాలనలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, ఆ కసితోనే ప్రజలు ఓట్లు వేయలేదని పేర్కొన్నారు. పత్తికొండ తాలుకా తెలుగుదేశం పార్టీకి కంచుకోట అని, పత్తికొండ అభివృద్ధే ధ్యేయంగా కేఈ శ్యాంబాబు ముందుకు వెళ్తారని అన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి కార్యకర్త కష్టపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం రామాంజులు, పారా విఠోబ తదితరులు ఉన్నారు.

**మద్దికెరలో బైక్ ర్యాలీ:** టీడీపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు గురువారం మద్దికెర, పెరవలి గ్రామాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యులు పురుషోత్తంచౌదరి, జమేదార్ రాజన్నయాదవ్, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు చంద్రశేఖర్‌గౌడ్‌ను సన్మానించారు.

## లైసెన్సు లేని దుకాణాల నుంచి విత్తనాలు కొనొద్దు

**మద్దికెర, జూన్ 6:** గ్రామీణ ప్రాంతాల్లో కొంత మంది లూజు విత్తనాలు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, లైసెన్సు లేకుండా విత్తనాలు అమ్మేవారి వద్ద ఎట్టి పరిస్థితుల్లో విత్తనాలు కొనుగోలు చేయవద్దని వ్యవసాయాశాఖ అధికారి ఉప్పర రవి అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని పెరవలి గ్రామంలో లూజు విత్తనాలు అమ్ముతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, వారిని మందలించామని పేర్కొన్నారు. లూజు విత్తనాల వల్ల ఒకవేళ పంట దిగుబడి రాకపోతే ఎలాంటి పరిహారం కూడా రాదని అన్నారు.

## కార్యనిర్వాహక కార్యదర్శిగా రాందాస్ గౌడ్

**దేవనకొండ ,జూన్ 6 :** టీడీపీ కర్నూలు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శిగా గుండ్లకొండ రాందాస్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ నెల 3వ తేదీన టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి పార్టీ కార్యాలయంలో ధ్రువీకరించినట్లు రాందాస్‌గౌడ్ తెలిపారు.

## కులుమాల, పెద్దమరివీడులో ఎగిరిన టీడీపీ జెండా

**గోనెగండ్ల, జూన్ 6:** గోనెగండ్ల మండల పరిధిలోని కులుమాల, పెద్దమరివీడు గ్రామాలలో టీడీపీ తన సత్తచాటింది. సార్వత్రిక ఎన్నికలలో ఈ గ్రామాలలో టీడీపీకి మెజార్టీ వచ్చింది. టీడీపీకి కులుమాలలో 104 ఓట్లు, పెద్దమరివీడులో 68 ఓట్లు మెజార్టీ వచ్చింది. దీంతో ఆ గ్రామాలలో గత రెండు రోజులుగా పండగవాతవరణం ఏర్పడింది. కార్యకర్తలు బాణసంచ పేల్చి, కేక్ లు కట్ చేసుకొని సంబరాలు జరుపుకున్నారు.

## దోమల నియంత్రణకు చర్యలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

**ఆలూరు, జూన్ 6:** దోమల నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు ఆలూరు మండల ఈవో పీఆర్డీ ప్రకాష్ నాయుడు తెలిపారు. ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన "దోమలు బాబోయ్" అనే కథనానికి స్పందించిన ఆయన, గురువారం ఆలూరు పట్టణంలో ఫాగింగ్ చేయించారు. అన్ని వీధుల్లో వారం రోజులపాటు ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఇళ్ల ముందు దోమలు నిల్వ ఉండకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

## హోలహర్విలో సత్తా చాటిన టీడీపీ

**హాలహర్వి, జూన్ 6:** సార్వత్రిక ఎన్నికల్లో హాలహర్వి మండలం 714 టీడీపీ మెజారిటీ సాధించి సత్తాచాటిందని మండల కన్వీనర్ సుధాకర్, కామినహల్ రమేష్ అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ వైసీపీ కంచుకోటలాగా ఉన్న హాలహర్వి మండలం మెజారిటీ రావడం గర్వంగా ఉందన్నారు. 30ఎళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషమని, మండలంలో ప్రణాళికబద్ధంగా గ్రామస్థాయిలో సమన్వయం చేసుకోవడం వల్లే సాధ్యమైయిందని పేర్కొన్నారు. స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చవిచూశామని, ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్ సహకారంతో చంద్రబాబు నాయుడు పాలనలో అభివృద్ధి పనులు చేద్దామంటూ కార్యకర్తలకు భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రహల్లాదరెడ్డి, శ్రీధర్, మారుతి పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల పై సస్పెన్షన్ ఎత్తివేయాలి

**ఆదోని (అగ్రికల్చర్), జూన్ 6:** ఆరోగ్య సమస్యలతో ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయినా ఉపాధ్యాయులపై ఇచ్చిన సస్పెన్షన్ ఎత్తివేయాలని ఏపీ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య పట్టణ అధ్యక్షుడు అనిల్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో ముఖ్యనాయకుల సమావేశం పట్టణ కార్యదర్శి బడుగు బసవరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్షన్ విధులకు కేటాయిస్తూ ఉత్తర్వులకు, ఎలక్షన్ తేదీ నాటికి నెలరోజులు పైగా వ్యవధి ఉండడంతో ఉపాధ్యాయులు కొందరు అనారోగ్యంతో, వివిధ కారణాల చేత శిక్షణ తరగతులకు హాజరు కాకుండా ఎన్నికల విధులకు హాజరు కాలేకపోయారన్నారు. మానవతా దృక్పథంతో వారిపై విధించిన సస్పెన్షన్ను ఉపసంహరించుకొని, యధావిధిగా విధుల్లో చేర్చుకోవాలని కోరారు. నాయకులు కోటన్న, అలింసిద్ధికి, రమయ్య, రెహమాన్, చంద్రమౌళి, వెంకటేశులు, విజయ్‌కుమార్, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## పట్టణ అభివృద్ధికి సహకరిస్తాం

● కాంగ్రెస్ వామపక్ష నాయకులు

**ఆదోని టౌన్, జూన్ 6:** సార్వత్రిక ఎన్నికలలో ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని, పట్టణ సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ పార్థసారధికి సహకరిస్తామని కాంగ్రెస్ పార్టీ తరపున ఎమ్మెల్యేగా పోటీ చేసిన అభ్యర్థి గొల్ల రమేష్ యాదవ్, సీపీఐ జిల్లా నాయకుడు కే అజయ్‌బాబు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. ఆదోని పట్టణంలో పేరుకుపోయిన అనేక సమస్యల పరిష్కారం కోసం డాక్టర్ పార్థసారధి దృష్టి సారించాలని, అందుకు తాము కూడా పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్, జిల్లా నాయకులు దిలీప్ దోకా, మారుతి, సీపీఎం నాయకుడు తిప్పన్న, సీపీఐ నాయకుడు సుదర్శన్, ఆర్టీఐ యాక్ట్ డివిజన్ అధ్యక్షుడు హుసేనప్ప యాదవ్ పాల్గొన్నారు.


## గ్రంథాలయంలో ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

**ఆదోని (అగ్రికల్చర్), జూన్ 6:** పట్టణంలోని గ్రంథాలయంలో 37 రోజుల పాటు జరిగిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ రమేష్, గ్రంథాలయ అధికారిణి సుజాత మాట్లాడుతూ విద్యార్థులకు గ్రంథాలయం పై ఆసక్తి పెంచే విధంగా వేసవి శిబిరం జరిగిందన్నారు. గ్రంథాలయాలు విజ్ఞానాన్ని అందిస్తాయని తెలిపారు. పుస్తకం అష్టక భూషణం అని, పుస్తకం చదవడం ద్వారా ఆ పరమైన విజ్ఞానం వస్తుంది. సెల్‌ఫోన్ చూడడం ద్వారా పుస్తక పఠనానికి దూరమై, మానసికంగా ఆరోగ్యం దెబ్బతింటారని సూచించారు. విద్యార్థులకు యోగా, మెడిటేషన్, బుక్ రీడిటేషన్, బుక్ రీడింగ్, కథలు, డ్రాయింగ్, ఆటలు నిర్వహించారు. శిబిరంలో రాణించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది దేవేంద్ర పాల్గొన్నారు.

### పట్టాదారు పాసుపుస్తకాల కోసం

# రైతుల పాట్లు

● కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణ
● మూడు నెలల నుంచి మంజూరుకాని వైనం
● 500పైగా దరఖాస్తులు



**మద్దికెర, జూన్ 6:** మండలంలో రెవెన్యూ పాలన అస్తవ్యస్తంగా మారింది. మూడు నెలల నుంచి పట్టాదారు పాసు పుస్తకాల కోసం ఆయా గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి నేటి వరకు అడపా.. దడపా పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేశారేగానీ పూర్తి స్థాయిలో మంజూరు చేయడం లేదు. దీంతో రైతులు దరఖాస్తు చేసుకున్న పాసు పుస్తకాలు ఇంత వరకు రాలేదు. మండలంలోని బురుజుల, హంపా, కొత్తపల్లి, బొమ్మనపల్లి, ఎం.అగ్రహారం గ్రామానికి చెందిన రైతులు 500 మందికి పైగా పట్టాదారు పాసు పుస్తకాల కోసం తహసీల్దార్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నారు. కొంత మంది మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంటు ఉన్న రైతులకు కూడా పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు కావడం లేదంటే పరిస్థితి ఏ విదంగా అర్థం చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఉంటే.. కేవలం నెల రోజుల్లోనే పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేస్తామని రెవెన్యూ అధికారులు స్పష్టంగా చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. దీనికి తోడు తండ్రి చనిపోతే.. వారసత్వంగా కుమారుడికి, భర్త చనిపోతే భార్యకు బదిలీ చేసే పట్టాదారు పాసు పుస్తకాలు కూడా సక్రమంగా మంజూరు కావడం లేదు. ఇలాంటివి మండలంలో 26 మంది పట్టాదారు పాసు పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీసర్వే చేశారు. ఆ రీసర్వేకు సంబంధించిన రైతుల ఒక్కరికి కూడా పాసు పుస్తకాలు ఇవ్వకపోగా.. తప్పొప్పులు ఉండటంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. రెవెన్యూ అధికారులు మాత్రం మేము కొద్దిరోజులు ఉండిపోయేవారం. మాకేం సంబంధమంటూ బహిరంగంగానే చెబుతున్నారు. మేము కేవలం కుల, ఇన్‌కం సర్టిఫికేట్ల వరకు మాత్రమే ఇస్తామని, అన్నీ కరెక్టు ఉంటే..పాసు పుస్తకాలు ఇస్తామని చెబుతున్నారు. రీసర్వేకు సంబందించిన ఒక్క పాసు పుస్తకం కూడా ఇవ్వలేదు. దీంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆరంభమైంది. బ్యాంకులో రుణాలు తెచ్చుకోవాలంటే.. పాసు పుస్తకం ఎంతో అవసరం. పాసు పుస్తకాలు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రెవెన్యూ శాఖ అధికారులు స్పందించి పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ రీసర్వేకు సంబంధించిన పుస్తకాలు రాలేదని, కొంత మంది రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వడం జరిగిందని, మరో 26 పాసు పుస్తకాలు రావాల్సి ఉందని వివరణ ఇచ్చారు.

## పత్తికొండ టీడీపీకి అండ

● ఐదు మండలాల్లో టీడీపీ విజయకేతనం
● వైసీపీ ఆశలపై నీళ్లు చల్లిన పత్తికొండ, వెల్దుర్తి మండలాలు
● రౌండ్‌రౌండ్‌లో టీడీపీదే ఆధిక్యం



**పత్తికొండ,జూన్6:** ఎన్నికల ఫలితాల్లో పత్తికొండ నియోజకవర్గంలో టీడీపీ విజయకేతనం ఎగరవేసింది. పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, క్రిష్ణగిరి, వెల్దుర్తి ఐదుమండలాలలో మెజార్టీసాధించి వైసీపీకి కోలుకోలేని దెబ్బతీసింది. పత్తికొండ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2,23,603 మంది ఓటర్లు ఉండగా 1,89,645 మంది ఈవీఎంలద్వారా, 2,258 మంది పోస్టల్‌బ్యాలెట్ ద్వారా ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో 272 పోస్టల్‌బ్యాలెట్ ఓట్లుచెల్లనివిగా తీసివేశారు. తొమ్మిది మంది అభ్యర్థులు బరిలో ఉన్నప్పటికీ ప్రధానపార్టీలైన టీడీపీ, వైసీపీల నడుమే పోటీ సాగింది. నియోజకవర్గం మొత్తంగా వైసీపీ అభ్యర్థి కంగాటి శ్రీదేవికి 84,638 ఓట్లురాగా, టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు 98,849 ఓట్లు లభించి 14,211 మెజార్టీతో టీడీపీ గెలుపొందింది. టీడీపీ ఆవిర్భాం నుంచి ఈ నియోజకవర్గంలో టీడీపీ ఏడుసార్లు విజయం సాధించగా 2019 ఎన్నికల్లో వైసీపీ ప్రభంజనంలో ఓటమిని చవిచూసింది. ఈసారి ఎన్నికల్లో పత్తికొండలో టీడీపీ విజయం సాధించి మరోసారి కంచుకోటపై పార్టీ జెండాను ఎగరేసింది.

| మండలం | వైసీపి | టీడీపీ | మెజార్టీ | ఆధిక్యం |
|---|---|---|---|---|
| పత్తికొండ | 20,759 | 24,131 | 3,372 | టీడీపీ |
| మద్దికెర | 9,985 | 14,014 | 4,029 | టీడీపీ |
| తుగ్గలి | 19,484 | 21,594 | 2,110 | టీడీపీ |
| క్రిష్ణగిరి | 12,035 | 15,758 | 3,723 | టీడీపీ |
| వెల్దుర్తి | 21,686 | 22,121 | 542 | టీడీపీ |
| పోస్టల్‌బ్యాలెట్ | 689 | 1,231 | 542 | టీడీపీ |
| మొత్తం | 84,638 | 98,849 | 14,211 | టీడీపీ |

## మంత్రాలయం అభివృద్ధికి కృషి చేస్తాం

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి
● మాధవరంలో తెలుగు తమ్ముళ్ల సందడి




రాఘవేంద్రరెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

**మంత్రాలయం, జూన్ 6:** పార్టీ అధినేత, కాబోయే సీఎం సహకారంతో మంత్రాలయాన్ని సమస్యలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్.రాఘవేంద్రరెడ్డి, నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని మాధవరంలో తన నివాసానికి టీడీపీ శ్రేణులు, బీజేపీ, జనసేన నాయకులు పెద్ద ఎత్తున తరలిరావడంతో సందడిగా మారింది. శాలువ, పూలమాలలు, బొకేలు, బాణాసంచా కాలుస్తూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో చంద్రబాబు హవా కొనసాగుతోందని, రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలన్నది చంద్రబాబుకు తెలుసుని పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి పెద్దపీట వేసి అన్ని విధాలుగా చేయూత అందిస్తారని పేర్కొన్నారు. కార్యకర్తలందరూ పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పల్లెపాడు ముత్తురెడ్డి, సురేష్ నాయుడు, జ్ఞానేష్, సతీష్, రామక్రిష్ణ, రాకేష్ రెడ్డి, రమేష్, రాజారెడ్డి, పెద్ద ఎత్తున తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

## కూటమి గెలుపు.. ప్రజల గెలుపు : మీనాక్షి నాయుడు

● మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు



టీడీపీ ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడును సన్మానిస్తున్న నాయకులు

**ఆదోని, జూన్ 6:** కూటమి గెలుపు... ప్రజల గెలుపని మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు పేర్కొన్నారు. గురువారం టీడీపీ, జనసేన, బీజేపీ తిరుగులేని విజయం సాధించడంతో నాయకులు, కార్యకర్తలు మీనాక్షినాయుడుకు పూలమాలలు వేసి సన్మానాలు చేశారు. ఈ సందర్భంగా మీనాక్షినాయుడు మాట్లాడారు. ఐదేళ్ల వైసీపీ పాలనతో ప్రజలు విసిగి, వేసారిపోయారన్నారు. ప్రభుత్వం వస్తే, ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందన్న ఊహలలో వైసీపీ నాయకులు ఊగిపోయారన్నారు. చిన్న చిన్న పోస్టులు రాగానే ఎవ్వరిని పడితే వారిని సోషల్ మీడియాలో మాట్లాడటం జరిగిందన్నారు. ఇలాంటి వారికి ప్రజలు చక్కగా గుణపాఠం చెప్పి, ఇంటికి సాగనంపారన్నారు. ఆదోనిలో ఎప్పుడూ కూడా భూకబ్జాలు, దాడులు ఉండేవి కావని, ఈ ఐదేళ్లలో అవన్నీ చేశారన్నారు. వారికి కొంతమంది పోలీసులు సైతం వత్తాసు పలకడం జరిగిందన్నారు. కొంతమంది భూకబ్జాలకు పాల్పడినా, రెవెన్యూ అధికారులు కళ్లున్న కబోదులుగా మారి, వారికి ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఇలాంటి వారిని వదిలే ప్రసక్తే లేదని, ఏమి చేయాలో అది జరుగుతుందని అన్నారు.

## కొనసాగుతున్న సంబరాలు

**కౌతాళం, జూన్ 6:** రాష్ట్రంలో ఎన్డీఏ కూటమీ భారీ విజయం సాధించడంతో మండలంలోని టీడీపీ కార్యకర్తలు తమ నాయకులకు సన్మానించేందుకు గురువారం నాయకుల ఇళ్ల వద్ద సంబరాలు చేసుకుంటున్నారు. మండల కేంద్రంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, వల్లూరు, రాజనగర్ క్యాంపు వద్ద రైతు విభాగం రాష్ట్ర, జిల్లా ప్రధాన కార్యదర్శులు అడివప్పగౌడ్, వెంకటపతిరాజు, గోతులదొడ్డిలో మండల అధ్యక్షుడు ఉలిగయ్య గృహల వద్ద తమ నాయకులను శాలువాలు, పూలమాలలతో సన్మానిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చెన్నబసప్ప మాట్లాడుతూ రాష్ట్రంలో నరకాసుర పాలనను ప్రజలు తమ ఓటు అనే ఆయుధంతో ఇంటికి పంపారన్నారు. రాష్ట్రంలో సుపరిపాలనను అందించేందుకు విజనరీ నాయకుడు చంద్రబాబు నాయుడు సీఎం పదవిని ఆధిరోహించనున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కష్ట కాలంలో అండగా ఉండి కష్టాలను ఎదుర్కొన్న నాయకులకు, కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

**ఆదోని (అగ్రికల్చర్), జూన్ 6:** ఆదోని సబ్ డివిజన్‌కు అవసరమైన ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం చేశామని ఏడీఏ బాలవర్ధిని రాజు తెలిపారు. గురువారం తన కార్యాలయంలో సబ్ డివిజన్ పరిదిలోని ఆదోని, కౌతాళం, పెద్దకడబూరు, కోసిగి మండలాల వ్యవసాయ అధికారులతో సమావేశమై ప్రణాళిక తయారు చేశారు. డివిజన్‌లో సాధారణ విస్తీర్ణం, ఆయా పంటల సాగయ్యే వివరాలను మండల వారీగా ఏవోలతో వివరాలను సేకరించారు. అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇండెంట్ కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్లో 84,383 హెక్టార్ల విస్తీర్ణం ఉండగా, పత్తి 63,469 హెక్టార్లు, వేరుశనగ 2265 హెక్టార్లు, కంది 405 హెక్టార్లుతో పాటు ఇతర పంటలు సాగవుతాయి అన్నారు.

## వీరభద్రగౌడ్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలి

**ఆలూరు, జూన్ 6:** టీడీపీ పార్టీ అభివృద్ధి కోసం పని చేసి, జరిగిన ఎన్నికల్లో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలైన వీరభద్రగౌడ్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు న్యాయం చేసే దిశగా ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ రాంనాథ్ యాదవ్, ఆలూరు మండల కన్వీనర్ అశోక్, టీడీపీ రాష్ట్ర నాయకుల నారాయణ రెడ్డి, నారాయణ, జిల్లా నాయకులు నరసప్ప, కొమ్ము రామాంజినేయులు, నాగరాజు కోరారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం హర్షణీయం అన్నారు. రెండుసార్లు పోటీ చేసి ఓటమి పాలైన వీరభద్రగౌడ్‌కు నామినేట్ పదవి కేటాయిస్తే ఆలూరు అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

## పురాతన బావిని కాపాడాలి

● తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**హొళగుంద, జూన్ 6:** హొళగుంద గ్రామ శివారులోని అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన పురాతన మెట్ల బావిని కాపాడాలని ఆ దేవాలయం మాజీ దర్మకర్త సింధూలం కృష్ణయ్య, టీడీపీ మాజీ మండల కన్వీనర్ వీరన్న గౌడ్, పూజారి పవన్ కుమార్, దిద్ది తిక్కస్వామి, వెంకటేష్, కోగిలతోట రంగప్ప గురువారం డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు మాట్లాడుతూ, అగ్రహారం ఆంజనేయస్వామి దేవాలయానికి సంబంధించిన సర్వే నెంబర్ 657/బీలో 1.35 సెంట్లు భూమి ఉందన్నారు. దేవాలయానికి సంబంధించిన పురాతన మెట్ల బావిని కొందరు రాత్రికి రాత్రే జేసీబీల ద్వారా మట్టితో పూడ్చివేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి దేవాలయానికి సంబంధించిన భూమిని సర్వే చేసి, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా మెట్ల బావిని పరిరక్షించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ ఏఎస్ ప్రాసాద్ రాజుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ విషయం పై తహసీల్దార్ మాట్లాడుతూ రెండు రోజుల్లోఆలయ భూమిని సర్వే చేస్తామని తెలిపారు.

## ఎమ్మెల్యే బీవీ సహకారంతో వార్డు అభివృద్ధికి కృషి

**ఎమ్మిగనూరు, జూన్6:** జరిగిన ఎన్నికల్లో 21వ వార్డులో (103,104 పోలింగ్ బూతుల్లో) టీడీపీకి 645 మెజార్టీ ఇచ్చిన వార్డు ప్రజలకు ఎమ్మెల్యే బీవీ తరుపున శుభాకాంక్షలు తెలుపుతున్నామని ఆవార్డు కౌన్సిలర్ వీజేపీ దయాసాగర్ అన్నారు. భారీ మెజారిటీలో ఎమ్మెల్యేగా బీవీ గెలవటంతో 21వ వార్డులో టీడీపీ శ్రేణులు కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.

## 12 పంచాయతీల్లో టీడీపీ మెజారిటీ

**తుగ్గలి, జూన్ 6:** సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు తుగ్గలి మండలంలోని 12 పంచాయితీల్లో మెజారిటీ వచ్చింది. మండలంలో మొత్తం 49,316 ఓట్లకు గానూ 42,676 ఓట్లుపోలయ్యాయి. అందులో టీడీపీ అభ్యర్థి కేఈ శ్యాంబాబుకు 12 గ్రామ పంచాయతీల్లో దాదాపు 3,122 ఓట్ల మెజారిటీ వచ్చింది. కేవలం 6 పంచాయతీల్లో వైసీపీకి 1,015 ఓట్లు మెజారిటీ వచ్చింది. అత్యధికంగా జొన్నగిరిలో టీడీపీ అభ్యర్థికి 862 ఓట్లు వచ్చాయి. మండలంలో 2,017 ఓట్లు టీడీపీకి మెజారిటీ వచ్చింది. టీడీపీకి కంచుకోట అయిన తుగ్గలిలో ప్రతి ఎన్నికల్లో భారీ మెజారిటీ వస్తూ వుంది. ఈ ఎన్నికల్లో కూడా మెజారిటీ రావడంతో మండలంలో టీడీపీ నాయకులు సంబరాలు చేసుకున్నారు.

## వజ్రం లభ్యం

**తుగ్గలి, జూన్ 6:** వ్యవసాయ పనులు చేసుకుంటున్న ఓ కూలీకి విలువైన వజ్రం దొరికింది. గురువారం మండల పరిధిలోని జొన్నగిరిలో పొలం పనులు చేసుకుంటున్న వ్యవసాయ కూలీకి వజ్రం దొరకడంతో ఆ వజ్రాన్ని స్థానిక వజ్రాల వ్యాపారస్థుడు రూ.2లక్షలు, ఒకటిన్నర తులం బంగారు ఇచ్చి కొనుగోలు చేసినట్లు సమాచారం. తొలకరి జల్లులు కురిసినప్పుడు ఈ ప్రాంతంలో విరివిగా వజ్రాలు లభిస్తుంటాయి. వాటిని అన్వేషించడానికి ఇతర ప్రాంతాల నుంచి వజ్రాన్వేషితులు తండోపతండాలుగా తరలివస్తుంటారు.

## కొత్త ప్రభుత్వమైనా దళితుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు

**గోనెగండ్ల, జూన్ 6:** రాష్ట్రంలో కొత్తగా ఏర్పడుతున్న టీడీపీ ప్రభుత్వమైనా దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆనంద్‌బాబు, జిల్లా ఉపాధ్యక్షుడు కరుణాకర్ కోరారు. గురువారం మండల కేంద్రమైన గోనెగండ్లలో కేవీపీఎస్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతనంగా ఏర్పాటు కాబోతున్న నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వం దళితుల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వం పెన్షన్‌లను అందరికీ పెంచి డప్పుకళాకారులకు మాత్రం పెంచలేదన్నారు. స్మశానంలో గుంతుల తీసే వృత్తిదారులను, తంబుర కళాకారులను, చర్మకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు దేవదాస్, రంగన్న, సంటెన్న, దస్తగిరి, కరెన్న, కొండయ్య, మునిస్వామి, జయరాజు ఆదాం పాల్గొన్నారు.

## ఏపీ అభివృద్ధికి పట్టం కట్టిన ప్రజలు

● జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న



కార్యకర్తల మధ్య కేక్ కట్ చేస్తున్న జనసేన ఇన్‌చార్జి లక్ష్మన్న

**మంత్రాలయం, జూన్ 6:** ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజలంతా జగన్‌ను చిత్తు చిత్తుగా ఓడించి కూటమికి పట్టం కట్టి అఖండ మెజార్టీ అందించారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర ఐక్య వాల్మీకి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు, బీసీ సంక్షేమ సంఘం రాయలసీమ కన్వీనర్ బి.లక్ష్మన్న అన్నారు. గురువారం జనసేన కార్యకర్తలు లక్ష్మన్న ఇంటికి చేరుకుని కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. పవన్ కళ్యాణ్ కింగ్ మేకర్‌గా 21 మంది ఎమ్మెల్యేలను, రెండు ఎంపీ సీట్లను గెలుచుకుని రాష్ట్రాన్ని తన వైపు చూసే విధంగా మార్చుకున్నారని పేర్కొన్నారు. నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి జనసైనికులంతా పని చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు డీవీ రవిచంద్ర, ప్రకాష్, రాజశేఖర్, ఖాజా, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### అవినీతి పాలనకు చరమగీతం పాడిన ఓటర్లు

**ఆలూరు, జూన్ 6:** జగన్ అవినీతి పాలనకు రాష్ట్ర ప్రజలు చరమగీతం పాడటం హర్షణీయమని జనసేన పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకప్ప అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో జగన్ పార్టీ కనీస సీట్లు సాధించలేక, ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో పవన్ కళ్యాణ్‌ను హేళన చేసిన కొన్ని పార్టీలకు ఆయన సత్తా ఏమిటో తెలిసిందన్నారు. జిల్లాలో విజయం సాధించిన కూటమి ఎమ్మెల్యేలకు ఆయన అభినందనలు తెలిపారు.

## మారికాంబదేవి దేవాలయంలో బంగారం చోరీ

**కౌతాళం, జూన్ 6:** మండల పరిధిలోని ఓబుళాపురం గ్రామంలో గ్రామ దేవత మారికాంబదేవి దేవాలయంలో అమ్మవారి మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని దుండగులు చోరీ చేశారు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామ దేవత మారికాంబదేవికు భక్తులు సమర్పించిన 5తులాల బంగారు మంగళసూత్రం గొలుసును బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు తెలిపారు. రోజు వారి మాదిరిగానే దేవాలయ పూజారి ఈరన్న గురువారం అమవాస్య ఉండటంతో అమ్మవారికి పూజలు చేసేందుకు దేవాలయం తలుపులు తీయగా అమ్మవారి మెడలో ఉన్న బంగారు గొలుసు కనిపించకపోవడంతో గ్రామస్థులకు తెలిపారు. దేవాలయంలో ఎలాంటి సీసీ కెమెరాలు లేకపోవడంతో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఆలయ పూజారులు ఈరన్న నరసింహులు, రాజశేఖర్ తెలిపారు. చోరీకి గురైన బంగారు గొలుసుల విలువ దాదాపు రూ.3లక్షల వరకు ఉంటుందని పోలీసులు, దొంగలను గుర్తించి అమ్మవారి సొమ్మును స్వాధీన పరచాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## నవరత్నాల రథంపై విహరించిన ప్రహ్లాదరాయులు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయులు

**మంత్రాలయం, జూన్ 6 :** రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులు నవరత్నాల రథంపై విహరించారు. గురువారం దినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో బృందావనంకు విశేష పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణాలు, మంగళ వాయిద్యాల మధ్య నవరత్నాల రథం పై వజ్రాలు పొదిగిన ప్రహ్లదరాయులను అధిష్టించి ఆలయ ప్రాంగాణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవలో ఉత్సవ మూర్తిని అధిష్టించి ఊయలలో ఊగించారు.

## రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష విరాళం

**కౌతాళం, జూన్ 6:** ఉరుకుంద ఈరన్న స్వామి ఆలయ రాజగోపుర నిర్మాణానికి రూ.లక్ష నగదును విరాళంగా అందించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈఓ వెంకటేష్, పాలక మండలి అధ్యక్షుడు నాగరాజుగౌడ్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వామి వారికి దేవాలయంలో నిర్మిస్తున్న రాజగోపుర నిర్మాణానికి ఆదోని పట్టణవాసి కీర్తిశేషలు కాసా వీరప్రసాద్ జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రాధ రూ. లక్ష నగదును దేవాలయ కార్యాలయంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్‌కు అందజేసినట్లు తెలిపారు.